సాక్షి సంగారెడ్డి

గురువారం । 19 । జనవరి । 2023



శనగకు పచ్చపురుగు బెడద

యాసంగిలో విస్తారంగా సాగైన శనగ పంటను పచ్చ పురుగు, రబ్బరు పురుగు ఆశించింది. ఇది రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. 8లో

టీచర్ వక్రబుద్ధి



పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పి సక్రమమార్గంలో పెట్టాల్సిన ఓ ఉపాధ్యాయుడు వక్రబుద్ధి చూపాడు. కొద్ది నెలల క్రితం మహిళా టీచర్‌తో అసభ్యంగా ప్రవర్తించి సస్పెండ్ అయ్యాడు. తాజాగా మరో కేసులో జైలు పాలయ్యాడు. 8లో



రెండో విడతకు సర్వం సిద్ధం

నేడు జిల్లావ్యాప్తంగా ప్రారంభం కానున్న కంటి వెలుగును విజయవంతం చేసేందుకు అవసరమైన ఏర్పాట్లను అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. 9లో

న్యూస్‌రీల్

ఏర్పాట్లు పూర్తి చేయండి



కంటి వెలుగు ఏర్పాట్లను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ ఎల్లయ్య

ఝరాసంగం(జహీరాబాద్): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'కంటి వెలుగు' కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తి చేయాలని జెడ్పీ సీఈఓ ఎల్లయ్య అధికారులను ఆదేశించారు. బుధవారం ఝరాసంగం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. అన్నిశాఖల అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని సూచించారు. రోజుకు 300 మంది వరకు పరీక్షలు నిర్వహించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్టు పేర్కొన్నారు. సమావేశంలో ఎంపీడీఓ సుజాత, మండల వైద్యాధికారి రమ్య, ఎంపీఓ లక్ష్మయ్య, ఏపీఓ రాజ్‌కుమార్, ఏపీఎం బాలకృష్ణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సంగారెడ్డి టౌన్: షెడ్యూల్డ్ కులాలకు చెందిన విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో కూడిన ఇంగ్లిష్ మీడియం విద్యను అందించేందుకు బెస్ట్ అవైలబుల్ పథకం కింద దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఇన్‌చార్జ్ ఉప సంచాలకులు జగదీశ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకునే విద్యాసంస్థలు విద్యాబోధనలో ఉన్నత ప్రమాణాలు కలిగి ఉండాలన్నారు. గత ఐదు సంవత్సరాలకు పదో తరగతి ఫలితాల్లో 90 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత పొంది ఉండాలన్నారు. అందులో 50 శాతం మంది విద్యార్థులు ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించి ఉండాలని పేర్కొన్నారు. దరఖాస్తు ఫారాలు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయంలో లభిస్తాయని, పూర్తి చేసి అదే కార్యాలయంలో అందజేయాలన్నారు. దరఖాస్తులకు ఈనెల 31 ఆఖరు తేదని తెలిపారు. మరిన్ని వివరాలకు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయంలో నేరుగా, లేదా ఫోన్ నెంబర్ 8179715513లో సంప్రదించాలని సూచించారు. అలాగే షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఎస్సీ అభ్యర్థులకు గ్రూప్– 2, 3, 4 పోటీ పరీక్షలపై మూడు నెలల ఉచిత ఫౌండేషన్ కోర్సు నిర్వహించనున్నట్టు తెలిపారు. అభ్యర్థుల ఎంపిక మెరిట్ ఆధారంగా ఉంటుందని, పూర్తి వివరాలకు 9866187330, 9849907051 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాలి



రాస్తారోకో చేస్తున్న నాయకులు

జోగిపేట(అందోల్): నిజామాబాద్ జిల్లాలో దళిత టీచర్ మల్లికార్జున్‌పై దాడి చేసిన బీజేపీ, వీహెచ్‌పీ మతోన్మాదులను వెంటనే అరెస్ట్ చేయాలని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అతిమేల మాణిక్ డిమాండ్ చేశారు. బుధవారం దాడిని నిరసిస్తూ జోగిపేట పట్టణంలోని ప్రధాన రహదారిపై దళిత సంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా బీజేపీ పాలిత రాష్ట్రాల్లో దళితులు, మైనార్టీలు, గిరిజనులు, బీసీలపైన పెద్ద ఎత్తున దాడులు జరుగుతున్నాయని వాపోయారు. దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేసి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి విద్యాసాగర్, నాయకులు డాకుర్ మల్లేశ్, బీఎస్పీ నియోజకవర్గ ఇంచార్జ్ దుర్గయ్య, సమత సైనిక జిల్లా అధ్యక్షుడు బాలరాజ్, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి మహేశ్, దళిత నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఏడుపాయల హుండీ ఆదాయం రూ.47.89 లక్షలు

పాపన్నపేట(మెదక్): ఏడుపాయల వన దుర్గా భవానీ ఆలయ హుండీ ఆదాయం రూ.47,89,745 వచ్చినట్లు ఈఓ సార శ్రీనివాస్ తెలిపారు. బుధవారం 90 రోజుల అనంతరం లెక్కించిన హుండీలో పై నగదుతో పాటు , మిశ్రమ బంగారు, వెండి ఆభరణాలు వచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ రంగారావు, ఆలయ ధర్మకర్తలు మోహన్‌రావు, వెంకటేశం, చక్రపాణి, రాజు, పెంటయ్య, యాదాగౌడ్, బాగారెడ్డి, ఆలయ సిబ్బంది శ్రీనివాస్, మధు, ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాస్‌శర్మ , బ్రహ్మచారి, సాయిబాబ, నరేశ్, మహేశ్, రమేశ్, బలరాం, నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా అద్దాల పంపిణీ

- గ్లాసు డబ్బాలపై బార్‌కోడ్ పేషెంట్ల వివరాలు
- జిల్లాలో నేటి నుంచి 'కంటి వెలుగు'
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికార యంత్రాంగం

కంటి పరీక్షలు నిర్వహించే వారి సంఖ్య : 17.11 లక్షల మంది (18 ఏళ్లు పైబడిన వారు)	
నిర్వహణ బృందాలు	: 69 + 3 (బఫర్ టీంలు)
జీహెచ్‌ఎంసీ పరిధిలో	: మూడు టీంలు
పర్యవేక్షణకు..	: మెడికల్ కాలేజీ వైద్యాధికారుల బృందం
క్యాంపులు	: 854
కంటి అద్దాల అవసరం	: 1.29 లక్షలు (సుమారుగా)
ఇప్పటికే జిల్లాకు వచ్చిన అద్దాలు	: 64 వేలు
ఇతర పరీక్షల సామగ్రి	: 72 లెన్స్ బాక్సులు, 72 రీఫ్రాక్టోమీటర్లు, 72 కేవీ కిట్లు



సదాశివపేట రూరల్(సంగారెడ్డి): కంటి వెలుగు ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ శరత్



కంటి అద్దాలను ప్రదర్శిస్తున్న మంత్రి హరీశ్‌రావు (ఫైల్)

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: తొలి విడత 'కంటి వెలుగు'లో కంటి అద్దాల పంపిణీలో ఎదురైన ఇబ్బందులను అధిగమించేందుకు వైద్యారోగ్యశాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. అద్దాల ప్యాకింగ్‌పై బార్‌కోడ్‌తో పాటు, పేరు అడ్రస్‌లు ముద్రించాలని నిర్ణయించింది. గతంలో మాదిరిగా కాకుండా ఈసారి అద్దాలను నేరుగా ఆయా గ్రామాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు పంపాలని అధికారులు భావిస్తున్నారు. గతంలో అద్దాలను జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయానికి పంపారు. అక్కడి నుంచి పీహెచ్‌సీలకు పంపడం.. అనంతరం పేషెంట్లకు చేరవేయడంలో ఇబ్బందులు ఏర్పడ్డాయి. చాలా మందికి అద్దాలు అందలేదు. అందినా నిర్దేశిత సామర్థ్యం ఉన్న అద్దాలు చేతికంద లేదు. దీన్ని అధిగమించేందుకు ఈసారి బార్‌కోడ్, అడ్రస్‌లు ముద్రిస్తున్నారు. వాటిని నేరుగా ఆయా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు పంపేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

ఆత్మకూర్ పీహెచ్‌సీలో ప్రారంభం

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమం జిల్లాలో గురువారం నుంచి ప్రారంభం కానుంది. ఆత్మకూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఇందుకోసం జిల్లా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. బుధవారం అదనపు కలెక్టర్ రాజర్షిషాతో కలిసి కలెక్టర్ శరత్ పీహెచ్‌సీని పరిశీలించారు. కంటి వెలుగు కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ సహకరించి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సుమారు వెయ్యి మంది వైద్యారోగ్యశాఖ అధికారులు, సిబ్బందికి కంటి వెలుగు బాధ్యతలను అప్పగించారు. ప్రతి గ్రామంలో కంటి పరీక్ష క్యాంపులు నిర్వహించనున్నారు. ఒక్కో రోజు, ఒక్కో క్యాంపులో సుమారు 300 నుంచి 350 మందికి కంటి పరీక్షలు నిర్వహించేలా ప్రణాళిక రూపొందించారు. కంటి పరీక్షల నిర్వహణ నేటి నుంచి ప్రారంభమై జూన్ 15 వరకు కొనసాగుతుంది. అవసరమైతే మరికొన్ని రోజులు క్యాంపులను పొడగించనున్నారు.

ప్రత్యేక యాప్‌లో వివరాల నమోదు

కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహించేందుకు వైద్యారోగ్యశాఖ ప్రత్యేకంగా యాప్‌ను రూపొందించింది. కంటి పరీక్షలు చేయించుకున్న వారి ఆధార్ కార్డుతో పాటు, ఫోన్‌నెంబర్ ఇతర పూర్తి వివరాలను ఈ యాప్‌లో నమోదు చేస్తారు. గతంలో రూపొందించిన ఈ యాప్‌లో చాలా మట్టుకు మార్పులు, చేర్పులు చేశారు. అలాగే ప్రిస్క్రిప్షన్ గ్లాసులు అవసరం ఉన్న వారి కోసం అద్దాలను తయారు చేయించి నెల రోజుల్లో పేషెంట్లకు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఎప్పటికప్పుడు పర్యవేక్షణ

కంటి వెలుగును విజయవంతం చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఇప్పటికే సంబంధిత అధికారులు, సిబ్బందికి పూర్తిస్థాయిలో శిక్షణ ఇచ్చాం. మాక్ డ్రిల్ కూడా నిర్వహించాం. కంట్రోల్ రూంను సైతం ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పర్యవేక్షించేలా చర్యలు తీసుకుంటున్నాం.

– గాయత్రీదేవి, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారిణి

వందశాతం పన్ను వసూలు చేయాలి

కలెక్టర్ డాక్టర్ శరత్



టెలీ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ శరత్

సంగారెడ్డి టౌన్: జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో వంద శాతం పన్ను వసూళ్లు జరగాలని పంచాయతీ కార్యదర్శులను కలెక్టర్ శరత్ ఆదేశించారు. బుధవారం క్యాంపు కార్యాలయం నుంచి జిల్లాలోని వివిధ శాఖల అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనితీరు సరిగా లేని ఎంపీఓలకు, పంచాయతీ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని డీపీఓకు సూచించారు. అదేవిధంగా పారిశుధ్య నిర్వహణ నిరంతరం సక్రమంగా జరగాలన్నారు. గ్రామ పంచాయతీ నుంచి అందిస్తున్న పౌర సేవలపై పంచాయతీ కార్యదర్శులకు పూర్తి అవగాహన ఉండాలన్నారు. డెత్, బర్త్, తదితర సర్టిఫికెట్ల జారీని నిర్ణీత సమయంలోగా అందజేయాలన్నారు. ప్రతి శుక్రవారం వాటరింగ్ డే విధిగా జరగాలని స్పష్టం చేశారు. వైకుంఠధామాలు, రథాలు వినియోగంలోకి తీసుకురావాలన్నారు. ఉపాధి హామీ కూలీల మొబలైజేషన్ జరగాలని, లేబర్ పేమెంట్ జనరేట్ చేసి పే స్లిప్స్ అందజేయాలని సూచించారు. ఈజీఎస్ జాబ్ కార్డులకు ఆధార్ సీడింగ్ జరగాలని తెలిపారు. నర్సరీలు వందశాతం పూర్తి కావాలని.. రానున్న హరితహారానికి సంబంధించి లక్ష్యం మేరకు ప్లానింగ్ చేసుకోవాలన్నారు. కంటి వెలుగుకు విస్తృత ప్రచారం కల్పించాలని.. క్యాంపు నిర్వహణ సజావుగా జరిగేలా పూర్తి బాధ్యతతో పనిచేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాజర్షిషా, జిల్లా పంచాయతీ అధికారి సురేశ్ మోహన్, డీఆర్‌డీఓ శ్రీనివాసరావు, ఏపీడీలు, డీఎల్‌పీఓలు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో వేగం పెంచండి

జిల్లా కేంద్రంలో నిర్మిస్తున్న సమీకృత మార్కెట్ సముదాయం పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ శరత్ సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. బుధవారం మార్కెట్ సముదాయ పనులను తనిఖీ చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పనులు పూర్తయితే పట్టణ ప్రజలకు అందుబాటులోకి వచ్చి ఒకే చోట అన్ని విక్రయాలు జరుగుతాయని పేర్కొన్నారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ రాజర్షిషా, పబ్లిక్ హెల్త్ ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

పన్నాగం పటాపంచలు

బెడిసికొట్టిన ధర్మానాయక్ వ్యూహం



అక్క సుందతో ధర్మానాయక్– నీల దంపతులు (ఫైల్)

టేక్మాల్(మెదక్): ప్రభుత్వ ఉద్యోగి అయినా.. అధికంగా డబ్బు సంపాదించాలనే అత్యాశ ధర్మానాయక్‌ది. మొదట్లో షేర్, స్టాక్ మార్కెట్‌లో లాభాలు వచ్చాయి. కరోనా, ఉక్రెయిన్ వార్ కారణంగా నష్టాల పాలయ్యాడు. చిట్టీలు వేస్తూ కొంత డబ్బు కూడబెట్టి మళ్లీ షేర్‌లలో పెట్టినా వచ్చిన డబ్బుతో అప్పులు తీరలేదు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లోనూ నష్టాలు వచ్చాయి. దీంతో అప్పుల నుంచి బయటపడేందుకు ఎల్ఐసీ పాలసీ ప్లాన్ వేశాడు. అయితే పన్నిన పన్నాగం పటాపంచలైంది. ఆయనతోపాటు కుటుంబ సభ్యులను కూడా కటకటాలపాలయ్యేలా చేసింది. అప్పు నుంచి తప్పించుకోవడానికి బీమా పాలసీ చేయడం, దానికి క్లెయిమ్ చేయడానికి ఒకరిని హతమార్చే విషయమై ముందుగానే కుటుంబ సభ్యులతో చర్చించాడు. మూడు నెలల ముందే అనేక వ్యూహాలు పన్నాడు. తన పథక రచన సజావుగా సాగేందుకు సోదరి, ఆమె కుమారుడిని, భార్యను కూడా ఇందులో ఇన్‌వాల్వ్ చేశాడు. ఘటనాస్థలిలో చనిపోయిన వ్యక్తి ధర్మానాయక్ కాదన్న అనుమానంతో పోలీసులు కుటుంబ సభ్యులపై పెట్టిన నిఘా కారణంగా వారంలోనే కేసును పోలీసులు ఛేదించారు. ధర్మా చేసిన తప్పులో ఆయన భార్య నీల, సోదరి సుంద, మేనల్లుడు శ్రీనివాస్‌లు పాలుపంచుకున్నట్లు విచారణలో తేలింది. ధర్మానాయక్‌కు ఇద్దరు కూతుళ్లు. పెద్ద కూతురు అఖిల, చిన్న కూతురు సుస్మిత ఐఐటీలో ఇంజనీరింగ్ చదువుతున్నారు. కొడుకు రాహుల్ కూకట్‌పల్లిలో ఇంటర్ చదువుతున్నాడు. ధర్మానాయక్ చేసిన తప్పునకు పిల్లల చదువులు ఆగమయ్యే పరిస్థితి దాపురించిందని తండావాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జరిగిన ఘటనతో ధర్మానాయక్ తండ్రి దుర్గానాయక్ ఈ వృద్ధాప్యంలో కుంగిపోతున్నాడు.

భూ సమస్యలపై ఉద్యమాలు



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

జోగిపేట(అందోల్): మండల పరిధిలోని కొండారెడ్డిపల్లి రైతుల భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేసి వెంటనే పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు డిమాండ్ చేశారు. బుధవారం రైతులతో కలిసి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనేక సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాలు ఇవ్వడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. భూ సమస్యలను పరిష్కరించనట్లయితే జిల్లావ్యాప్తంగా సీపీఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నియోజకవర్గం కన్వీనర్ విద్యాసాగర్, రైతులు దుర్గయ్య, రాములు, అడివయ్య, మానయ్య, కేతవత్ భీమ్లా నాయక్, సోముల బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

కరోనా కేసులు నిల్

పటాన్‌చెరుటౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. బుధవారం 34 మందికి టెస్టులు నిర్వహించగా అందరికీ నెగెటివ్‌గా నిర్ధారణ అయినట్టు సిబ్బంది తెలిపారు. 30 మందికి ఆర్టీపీసీఆర్ టెస్టులు నిర్వహించామన్నారు.

నిర్వాసితులకు మెరుగైన పరిహారం ఇవ్వాలి



ఆర్డీఓ కార్యాలయ అధికారికి వినతిపత్రం ఇస్తున్న రైతులు

జహీరాబాద్ టౌన్: 2013 భూసేకరణ చట్టం ప్రకారం భూ నిర్వాసితులకు మెరుగైన పరిహారం అందించాలని భూనిర్వాసితుల సంఘం అధ్యక్షుడు ఆశప్ప అన్నారు. నిమ్జ్ భూనిర్వాసితులతో కలిసి బుధవారం ఆర్డీఓ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిమ్జ్ కోసం అధికారులు బలవంతంగా రైతుల పొలాలను తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. రైతులతో సమావేశాలు నిర్వహించుకుండా నోటిఫికేషన్ జారీ చేశారని, ప్రైమరీ నోటిఫికేషన్‌కు రైతులు సమాధానం ఇచ్చినా, మరో నోటిఫికేషన్‌తో ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. విలువైన భూములకు రూ.15 లక్షల చొప్పున ఇస్తామనడం సరికాదని, భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

ట్రిపుల్‌ఆర్‌తో మాకేం లాభం

- రూ. కోట్లు విలువ చేసే భూములు లాక్కుంటారా?
- ప్రజాభిప్రాయ సేకరణలో రైతుల ఆగ్రహం



ప్రజాభిప్రాయ సేకరణకు హాజరైన భూ యజమానులు

జోగిపేట(అందోల్): రూ. కోట్లు విలువ చేసే భూములు రోడ్డు కోసం ధారాదత్తం చేసేందుకు సిద్ధంగా లేమని రైతులు ఖరాఖండిగా చెప్పారు. బుధవారం చౌటకూరు మండలం సుల్తాన్‌పూర్‌లోని ఎంఎస్ గార్డెన్‌లో ట్రిపుల్‌ఆర్‌పై పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. కార్యక్రమానికి అదనపు కలెక్టర్ వీరారెడ్డి, పర్యావరణ శాఖ ఇంజినీర్ గీత సఫారి హాజరై రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. జిల్లాలోని 19 గ్రామాలకు చెందిన 43 మంది భూ యజమానులు తమ అభిప్రాయాలను తెలిపారు. ట్రిపుల్‌ఆర్‌తో తమకేంటి లాభమని, రోడ్డు వేయమని ఎవరడిగారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎకరాకు ఎంత చెల్లిస్తారో ఇప్పటివరకు ప్రభుత్వం ప్రకటించలేదని మండిపడ్డారు. భూములు తీసుకుంటే తాము బతకడం కష్టమని, కనీసం తమ పిల్లలకైనా మొదటి ప్రాధాన్యతగా ఉద్యోగ అవకాశాలు కల్పించాలని మల్లేశం అనే రైతు కోరారు. భూమికి బదులు భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. దళితులకు చెందిన భూములు లాక్కొని తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని బొబ్బిలి రాజు ఆవేదన వ్యక్తం చేశారు. తాము చాలా ఏళ్లుగా వ్యవసాయం చేసుకొని జీవనం సాగిస్తున్నామని.. ప్రభుత్వం తమ భూములు తీసుకోవడం సరికాదని కుల్పగూరుకు చెందిన ఓమర్ బిన్ మహ్మద్ అన్నారు. మా ఓట్లతో గద్దెనెక్కిన ప్రజాప్రతినిధులు తమకు అన్యాయం జరుగుతున్నా పట్టించుకోవడంలేదని.. ఊర్లకు వచ్చే ఎమ్మెల్యేలను అడ్డుకొని నిలదీయాలని శివ్వంపేటకు చెందిన దశరథ్ ఆవేశంగా మాట్లాడారు.

మేమెట్లా బతకాలి



మాకు తెలియకుండానే భూములు కొలుస్తుంటే ఎందుకు కొలుస్తున్నారని అడిగితే కలెక్టర్‌ను అడగాలని చెబుతున్నారని నిర్మల అనే మహిళా రైతు వాపోయింది. తనకు 2.06 ఎకరాల భూమి ఉందని.. రోడ్డు కోసం భూమిని తీసుకుంటున్నట్లు తెలిసి సర్వే చేసేటోళ్లను ప్రశ్నిస్తే కలెక్టర్‌కు చెప్పినా నీ భూములు నీకు దక్కవంటూ హెచ్చరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. ఏళ్ల తరబడి ఆ భూముల్లో కూరగాయలు, వరి పండించుకుంటూ బతుకుతున్నాం. వ్యవసాయం తప్ప ఏ ఆధారంలేని నా కుటుంబాన్ని ఆదుకోవాలని వేడుకుంది. భూమి అంతా మీరు తీసుకుంటే మేమెట్లా బతకాలని అధికారులను ప్రశ్నించింది.

బహిష్కరించి.. రోడ్డుపై బైఠాయించి

ట్రిపుల్‌ఆర్ ఏర్పాటులో కోట్ల విలువ చేసే భూములు ఇచ్చేదిలేదని తెలంగాణ జన సమితి జిల్లా అధ్యక్షుడు తుల్జారెడ్డి నేతృత్వంలోని 50 మంది రైతులు అభిప్రాయ సేకరణను బహిష్కరించి జాతీయ రహదారిపై బైఠాయించారు. దీంతో జోగిపేట వైపు వెళ్లే వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ఈసందర్భంగా సీఎం కేసీఆర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అరగంట తర్వాత



జోగిపేట సీఐ నాగరాజు పోలీసు సిబ్బందితో వారిని రోడ్డుపై నుంచి పక్కకు తప్పించారు.

భారీ పోలీసు బందోబస్తు

పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణకు పెద్ద ఎత్తున పోలీసులను మోహరించారు. సంగారెడ్డి డీఎస్పీ రవీందర్‌రెడ్డి నేతృత్వంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఫంక్షన్ హాల్‌లో బారికేడ్లను ఏర్పాటు చేశారు. రైతులు వేదిక వద్దకు వచ్చి ఆందోళన చేయకుండా ముందస్తుగా చర్యలు తీసుకున్నారు. కొంతమంది రైతులు బహిష్కరించినా మిగితా రైతులు తమ అభిప్రాయాలను తెలియజేశారు.



కోర్టుకు వెళ్లాల్సిన అవసరం లేదు

రోడ్డు ఏర్పాటుకు అవసరమైన భూములను సేకరించిన సమయంలో ఎవరికైనా నష్ట పరిహారం తక్కువ వచ్చినట్లు భావిస్తే కోర్టుకు వెళ్లాల్సిన అవసరం లేదని అదనపు కలెక్టర్ వీరారెడ్డి అన్నారు. కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి పరిష్కరించే అవకాశం ఉందన్నారు. అభివృద్ధి జరిగినప్పుడు కొంత మందికి లాభం.. కొంతమందికి నష్టం జరుగుతుందన్నారు. జోగిపేట, హైదరాబాద్ రోడ్డు ఎంతో మంది రైతులు త్యాగం చేస్తేనే ఏర్పడింది. రైతులు, భూ యజమానులు ఇచ్చిన అభిప్రాయాలను ఎడిట్ చేయకుండా ఉన్నది ఉన్నట్టు కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖకు పంపుతామని తెలిపారు. 19 గ్రామాలకు చెందిన 43 మంది తమ అభిప్రాయాలను తెలియజేశారని వెల్లడించారు.



రైతుకు గుండెపోటు వచ్చిందని ప్రచారం జరగగా.. చివరికి ఆయన ఆరోగ్య పరిస్థితి అదుపులోనే ఉన్నట్టు సమాచారం రావడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

సొమ్మసిల్లి పడిపోయిన రైతు

పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణలో కొద్ది సేపు టెన్షన్ వాతావరణం నెలకొంది. చౌటకూరు మండలం వెంకటకిష్టాపూర్‌కు చెందిన సోమయ్య అనే రైతుకు చెందిన భూమి ట్రిపుల్‌ఆర్‌లో పోతుంది. అధికారులు అభిప్రాయ సేకరణ చేపడుతున్న సమయంలో సోమయ్య ఒక్కసారిగా సొమ్మసిల్లి కింద పడిపోయాడు. గమనించిన పోలీసులు వెంటనే ఆయనను ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. సమావేశంలో కొద్దిసేపు గందరగోళం ఏర్పడింది.

క్లుప్తంగా

హుండీ ఆదాయం రూ.8.15 లక్షలు

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని కొండ పోచమ్మ అమ్మవారి ఆలయంలో మూడు నెలల హుండీ ఆదాయం రూ.8,15,164 వచ్చినట్లు ఆలయ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ఈఓ మోహన్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆలయంలో దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో హుండీ డబ్బును లెక్కించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చిన ఆదాయాన్ని ఆలయ బ్యాంక్ ఖాతాలో జమ చేయనున్నట్లు తెలిపారు. అలాగే ఈ 23వ తేదీ నుంచి ప్రారంభమయ్యే జాతరకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ సూపరింటెండెంట్ శివకుమార్, సర్పంచ్ రజితారమేష్, ఆలయ సిబ్బంది వెంకట్‌రెడ్డి, కనకయ్య, లక్ష్మణ్, సుధాకర్, చిన్నా, హరి, చందు తదితరులు పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. సిద్దిపేటలోని నర్సాపూర్ చౌరస్తా, ఎంపీడీవో కార్యాలయ చౌరస్తా, రాజీవ్ రహదారిపై సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తమ సిబ్బందితో నిర్వహించిన వాహనాల తనిఖీల్లో ఎనిమిది మంది పట్టుబడ్డారు. వారిని సిద్దిపేట కోర్టులో హాజరుపర్చగా జడ్జి రమేశ్‌బాబు రూ.19 వేల జరిమానా విధించారు.

అంబేడ్కర్ ప్రతిమ ఏర్పాటు చేయాలి

గజ్వేల్‌రూరల్: గణతంత్ర దినోత్సవం నాడు జాతీయ జెండా ఎగురవేసే ప్రదేశంలో అంబేడ్కర్ ప్రతిమ పెట్టేలా ఆదేశాలు జారీచేయాలని డీబీఎఫ్(దళిత బహుజన ఫ్రంట్) జాతీయ కార్యదర్శి పి.శంకర్ కలెక్టరేట్ కార్యాలయంలో ఏఓ రెహమాన్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. గొప్ప రాజ్యాంగాన్ని రచించిన మేధావి అంబేడ్కర్ అని, ఆయన గొప్పతనాన్ని భవిష్యత్ తరాలకు తెలియజేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. గణతంత్ర దినోత్సవం నాడు అంబేడ్కర్ ఫొటోలు పెట్టకుండా జెండా ఆవిష్కరణ చేయడం సరికాదని, జాతీయ జెండావిష్కరణ ప్రాంతంలో ప్రతీ ఒక్కరు అంబేడ్కర్ ప్రతిమను ఏర్పాటు చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరినట్లు తెలిపారు.

బీఆర్ఎస్ చిత్రం ఆవిష్కరణ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): బీఆర్ఎస్ ఆవిర్భావ సమావేశం సందర్భంగా జిల్లాకు చెందిన చిత్రకారుడు రుస్తుం బీఆర్ఎస్ చిత్రాన్ని బుధవారం తన ఆర్ట్ గ్యాలరీలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ఆవిర్భావం కోసం కేసీఆర్ టీఆర్ఎస్ పార్టీని స్థాపించి విజయవంతం అయ్యారన్నారు. నేడు దేశ అభివృద్ధికి బీఆర్ఎస్‌గా మారిందని, కేసీఆర్ దేశ రాజకీయాల్లో రాణించడం తథ్యమన్నారు.

శనగకు పచ్చపురుగు బెడద

- పూత, కాత దశలో దెబ్బతింటున్న పంట
- దిగుబడిపై చూపనున్న ప్రభావం
- సకాలంలో సస్యరక్షణ చేపడితే ప్రయోజనం
- శాస్త్రవేత్త ఎన్.స్నేహలత


పచ్చపురుగు

జహీరాబాద్: జిల్లాలో యాసంగి కింద విస్తారంగా సాగులో ఉన్న శనగ పంటకు పచ్చపురుగు, రబ్బరు పురుగు ఆశించింది. ఇది రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. ప్రస్తుతం శనగ పంట పూత, కాత దశలో ఉంది. యాసంగిలో తేమ ఆధారంగానే శనగ పంటను పండిస్తారు. జిల్లాలో 20 వేల ఎకరాకు పైగా పంట సాగులో ఉంది. చీడపీడలు, తెగుళ్లను అరికట్టే విషయంలో నిర్లక్ష్యం చేస్తే దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉంది. ఈ సమయంలో శనగ పచ్చ పురుగు, రబ్బరు పురుగు దాడి ఉధృతమైతే పంటను కాపాడుకోవడం కష్టమవుతుందని డీడీఎస్-కేవీకే శాస్త్రవేత్త ఎన్.స్నేహలత హెచ్చరిస్తున్నారు. సకాలంలో సస్యరక్షణ చేపట్టాలని చెబుతున్నారు.

శనగ పచ్చ పురుగు:

- ఇది పంట పండించే అన్ని ప్రాంతాల్లో కనిపిస్తుంది. ఎక్కువగా పూత, కాత దశలో ఆశిస్తుంది.
- ఈ రెక్కల పురుగు ఆకులు పూత, కాయపైన ఒకొక్క గుడ్డు పెడుతుంది. దాని నుంచి పొదిగిన లద్దె దశ లేత పసుపు రంగుగా మారుతుంది. పెరుగుతున్నకొద్ది ఆకుపచ్చరంగు, గోధుమ పసుపు రంగుకు మారి గులాబీ రంగు చారలు కలిగి ఉంటుంది.
- పొదిగిన లద్దె దశలో (మొదటి దశ) ఆకులను తింటుంది. రెండో దశలో పూ మొగ్గలను తింటుంది. చివరి దశలో కాయలను తింటుంది.

రబ్బరు పురుగు

- పంట మొదట్లో ఆశిస్తుంది. రెక్కల పురుగు ఆకులమీద గుడ్లు పెట్టి వాటి మీద గోధుమ రంగు వెంట్రుకలతో కప్పి ఉంటాయి. వాటి నుంచి పొదిగిన లద్దె దశలో గుంపులాగా ఆకుల మీద, కాండం మీద ఉంటూ ఆకుల పత్ర హరితాన్ని గోకి తినడం వల్ల ఆకుల ఈనెలు మాత్రమే మిగులుతాయి.

యాజమాన్య పద్ధతులు

- ఈ పురుగుల ఉనికిని గుర్తించి ఎకరాకు ఐదు లింగాకర్షక బుట్టలు అక్కడక్కడ అమర్చుకోవాలి. అందులో కనుక 5 నుంచి 8 పురుగులు గమనించినట్లయితే పిచికారీ చేపట్టాలి.
- శనగలో అక్కడక్కడ బంతి, ఆముదం సాగుచేపడితే ఎర పంటలుగా పనిచేస్తుంది.
- పంటలో పేలాలు చల్లడంతో పాటు వై ఆకారంలో ఉన్న కట్టెలను పక్షులు వాలటానికి అక్కడక్కడ 10 వరకు అమర్చుకోవాలి. దీన్ని వల్ల లద్దె పురుగులను పక్షులు తింటాయి.
- పంట తొలి దశలో వేపనూనె 5 మిల్లీలీటర్లు లేదా లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. లేదా 5 శాతం వేప గింజల కషాయం తయారు చేసుకుని పిచికారీ చేయాలి.
- ఆ తర్వాత ఎన్‌పివి (న్యూక్లియర్ పాలి హైడ్రోసిస్ వైరస్) వంద లార్వాలకు సరిపడేంత లేదా బీటి (బాసిల్లస్ తురెంజెనసిస్) 400 గ్రాములు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి.
- అలాగే దశపర్ణి కషాయం 6 లీటర్లు, 200 లీటర్ల నీటికి కలిపి వారం మధ్యలో రెండు సార్లు పిచికారి చేయాలి.


శనగ కాయను తొలిచిన పురుగు

ఎండు తెగుళ్లు:

- మొక్క చివరి నుంచి ఎండిపోతుంది. అలాగే వేర్లు చీల్చి చూస్తే గోధుమ రంగు లేదా నల్లగా కనబడుతుంది.

వేరుకుళ్లు తెగుళ్లు:


శనగ ఆకును ఆశించిన పచ్చపురుగు

- పూత, కాత దశల్లో వ్యాపిస్తుంది. పంటలో నీరు నిల్వ ఉన్నప్పుడు, ఎక్కువ ఉష్ణోగ్రత ఉన్నప్పుడు వస్తుంది. పూర్తిగా ఎండిపోయిన మొక్కను పీకితే వెంటనే ఊడి వస్తుంది. అలాగే వేర్లు నల్లగా అవుతాయి.

మొదళ్ల కుళ్లు తెగుళ్లు:

- మొక్క మొదట్లో మచ్చ ఏర్పడి, మొక్క పడిపోయి కుళ్లిపోతుంది. ఈ మొక్క పసుపు రంగులో మారి ఎండిపోతాయి. ఈ తెగుళ్లు ఎక్కువగా నీరు నిల్వ వలన, దుక్కిలో వేసుకున్న పెంటెరువులు సరిగ్గా కుళ్లకపోవడం వల్ల, ఉదజని సూచిక తక్కువ అయినప్పుడు, ఉష్ణోగ్రత ఎక్కువగా ఉన్నప్పుడు ఆశిస్తాయి.

యాజమాన్య పద్ధతులు

- ఈ తెగుళ్లు వ్యాపింప చేసే సిలింద్రాలు 6 సంవత్సరాలుగా అలాగే నెలలో ఉంటాయి. జొన్న, మొక్కజొన్న లాంటి పంటలను వేసుకుని పంట మార్పిడి చేసుకోవాలి.
- వేసవిలో లోతు తక్కువ దుక్కులను చేసుకోవాలి.
- 200 కిలోల పేడలో లేదా ఎరువులో కిలో ట్రైకోడర్మా విరిడి కలిపి పక్షం రోజుల తర్వాత దుక్కిలో వేసుకున్నట్లయితే భూమిలో ఈ సీలింద్రాలని అరికట్టుకోవచ్చు.
- తెగుళ్లు సోకిన మొక్కలు ఎండిపోవడం గుర్తించి తీసి వేసి, దూరంగా పారవేయడం లేదా కాల్చివేయడం చేయాలి. మొక్క తీసిన చోట 10 గ్రాముల సూడోమోనాస్ లేదా ట్రైకోడర్మా విరిడి లీటరు నీటికి కలిపి మొదట్లో (డ్రెన్చింగ్) చేసుకోవాలి.

బురదలో కూరుకుపోయి వృద్ధుడి మృతి



జహీరాబాద్: బురదలో కూరుకుపోయి గుర్తు తెలియని వృద్ధుడి మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని చిరాగ్‌పల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ కాశీనాథ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మృతుడి ధరించిన ఆకుపచ్చషర్టుపై రాజు చిడ్‌గుప్ప టైలర్ మార్కు, ఎడమ చేతిపై పచ్చబొట్టుతో శిలువ గుర్తు ఉందన్నారు. మృతదేహాన్ని జహీరాబాద్ ప్రభుత్వాస్పత్రిలో భద్రపర్చామన్నారు. పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలన్నారు. వివరాలకు చిరాగ్‌పల్లి ఎస్ఐ 8712656766 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ట్రాక్టర్ దగ్ధం



పాపన్నపేట(మెదక్): గుర్తు తెలియని వ్యక్తులు ట్రాక్టర్ దగ్ధం చేసిన సంఘటన మండల పరిధిలోని మిన్‌పూర్‌లో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. పాపన్నపేట ఎస్ఐ విజయ్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన రఘుపతిరాజు దుమ్ము చక్రాల ట్రాక్టర్‌ను గ్రామ శివారులోని ఓ పొలంలో ఉంచాడు. గుర్తు తెలియని ట్రాక్టర్‌ను తగులబెట్టారు. తెల్లవారు జామున అటుగా వెళ్లిన వ్యక్తులు ఇచ్చిన సమాచారంతో బాధితుడు సంఘటనా స్థలానికి వెళ్లి కాలిపోయిన ట్రాక్టర్‌ను చూసి ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ విజయ్ తెలిపారు.

విద్యుత్ వైర్లలో గాలిపటం

తీసేందుకు యత్నం, విద్యుదాఘాతంతో బాలుడి మృతి


విద్యుత్ వైర్లను తగిలి మృతి చెందిన రిషి

జిన్నారం(పటాన్‌చెరు): గాలిపటం విద్యుత్ వైర్లకు చిక్కుకుంది. దానిని తీసేందుకు బాలుడు యత్నించటంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో బుధవారం జరిగింది. సీఐ సురేందర్‌రెడ్డి, స్థానికుల కథనం ప్రకారం... కృష్ణా జిల్లా నందిగామకు చెందిన వీరబాబు-మాన్‌సాలమ్మ దంపతులు బొల్లారంలోని మల్లన బస్తీలో ఉంటున్నారు. వీరి కుమారుడు రిషి(12) స్థానిక ఓ ప్రైవేటు పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నాడు. భవనంపైకి ఎక్కి గాలిపటం ఎగురవేస్తున్నాడు. అయితే గాలివాటుకు విద్యుత్ వైర్లలో చిక్కుకుంది. దానిని తీసేయత్నంలో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్న మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. బాలుడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నామని సీఐ సురేందర్‌రెడ్డి తెలిపారు. బాలుడి మృత దేహాన్ని వారి స్వగ్రామానికి తరలించేందుకు బీజేపీ నేత ఆనంద్‌కృష్ణారెడ్డి అంబులెన్స్ ఏర్పాటు చేశారు. అంతేకాకుండా రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు.

మద్యం మత్తులో విగ్రహాల తొలగింపు


ఆలయంలో చిందర వందరగా విగ్రహాలు


పోలీసుల అదుపులో వలస కూలీలు

శివ్వంపేట(నర్సాపూర్): మద్యం మత్తులో వలస కూలీలు ఆలయంలోని విగ్రహాలను తొలగించారు. ఈ సంఘటన మండల పరిధి చెండి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామ శివారులో ఉన్న హరిదాస్ తండా ఫామ్‌హౌస్‌లో ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన పలువురు కూలీ పని చేస్తున్నారు. చెండి గ్రామంలో ఉన్న దుర్గమ్మ ఆలయంలోకి మంగళవారం అర్ధరాత్రి ఇద్దరు కూలీలు మద్యం మత్తులో ప్రవేశించి విగ్రహాలను తొలగించి అక్కడే నిద్రించారు. ఉదయం గమనించిన గ్రామస్తులు వారిని పట్టుకుని గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్బంధించారు. విషయం తెలుసుకున్న పోలీసులు గ్రామానికి చేరుకొని ఇరువురిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. 15 రోజుల క్రితం గ్రామంలోని చెండి కాంబ ఆలయంలో గుర్తుతెలియని వ్యక్తులు వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లారు.

దర్యాప్తు చేస్తున్న పోలీసులు

ఆలయంలో విగ్రహాలను తొలగించిన కూలీలను విచారిస్తున్నట్లు ఎస్ఐ రవికాంత్‌రావు తెలిపారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఓంప్రకాశ్‌గుప్తా, నేపాల్‌కు చెందిన రామ్ విశ్వకర్మగా గుర్తించినట్లు చెప్పారు. మద్యం మత్తులో దుర్గమ్మ ఆలయంలోకి ప్రవేశించి విగ్రహాలను తొలగించారన్నారు. వారు ఇంకా మద్యం మత్తులో ఉన్నారని, మత్తు దిగిన తర్వాత విచారణ చేపడతామని తెలిపారు.



విద్యార్థులను చితకబాదిన ఉపాధ్యాయుడు

- తీవ్రంగా గాయపడటంతో తల్లిదండ్రుల ఆగ్రహం
- చర్యలు తీసుకుంటామన్న ఎంఈఓ

సిద్దిపేటరూరల్: విద్యార్థులను ఓ ఉపాధ్యాయుడు చితకబాదిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు, విద్యార్థుల తల్లి దండ్రులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పుల్లూరు ప్రాథమిక పాఠశాలకు చెందిన 5వ తరగతికి చెందిన ముగ్గురు విద్యార్థులు అశ్విత్, వైష్ణవి, ధనుష్ విరామం సమయంలో కాలకృత్యాలు తీర్చుకునేందుకు బయటకు వెళ్లి ఆలస్యంగా వచ్చారు. దీంతో ఆగ్రహం చెందిన ఉపాధ్యాయుడు శ్రీనివాస్ కర్రతో కొట్టడంతో వారికి తీవ్ర గాయాలయ్యాయి. విద్యార్థులు ఇంటికి వెళ్లి తల్లిదండ్రులకు తెలపడంతో వారికి చికిత్స చేయించారు. సాయంత్రం ఉపాధ్యాయులు వెళ్లిపోవడంతో గురువారం అడుగుతామని విద్యార్థుల తల్లిదండ్రులు చెప్పారు. ఈ విషయంపై హెచ్ఎం రాజనర్సయ్యను వివరణ కోరేందుకు ఫోన్ చేయగా ఆయన స్పందించలేదు. దీంతో ఎంఈఓ శ్రీనివాస్ రెడ్డిని సంప్రదించగా ఉపాధ్యాయుడు కొట్టిన మాట వాస్తవమేనని గురువారం పాఠశాలకు వచ్చి వివరాలు తెలుసుకుని చర్యలు తీసుకుంటానన్నారు.


విద్యార్థి చేతివేలుకు తీవ్ర గాయమైన దృశ్యం

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

■ పర్సనల్, బిజినెస్, ప్రాపర్టీ, ల్యాండ్స్ & వ్యవసాయ భూములపై మార్టిగేజ్ చేసుకొని అతి తక్కువ వడ్డీకి, వారం రోజులలో ఋణం ఇవ్వబడును. ఏజెంట్స్ కావలెను. సంప్ర॥ 7836035286, 8901923173. [W-775802]

LOST

■ ఒరిజినల్ సర్టిఫికేట్ పోయినది బోజ రాజశేఖర్ S/o మల్లయ్య అను నేను సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం మాలపల్లి గ్రామానికి చెందినవాడను. నా యొక్క ఒరిజినల్ SSC మెమో సర్టిఫికేట్. తేది: 16-12-2022 రోజున మాలపల్లి గ్రామం నుండి హుస్నాబాద్ మండల కేంద్రానికి వస్తుండగా సర్టిఫికేట్ పోయినది. దొరికిన వారు సంప్రదించగలరు. తగిన పారితోషకం ఇవ్వబడును. సెల్: 9000805166 [K-1141935]

WANTED

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10-15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-776049]

■ షిర్డీ సాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో పనిచేయుటకు లేడీ వార్డెన్స్, లేడీ సూపర్ వైజర్స్, నర్సులు, ఆయాలు, భార్యాభర్తలు కావలెను. Ph: 9391036931, 9246585901 [HA-10046]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లైయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

దాడిచేసిన వారిని శిక్షించాలి

సిద్దిపేటరూరల్: అస్సాంలోని కరీంగంజ్ జిల్లా లోవిర్‌పురలో బజరంగ్‌దళ్ కార్యకర్తపై దాడి చేసి చంపిన జిహాదీ దుండగులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ విశ్వహిందూ పరిషత్ మెదక్ విభాగ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఏఓకు బుధవారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీ మెదక్ విభాగ్ సహ కార్యదర్శి రాజారాం మాట్లాడుతూ బజరంగ్‌దళ్ కార్యకర్తను నరికి చంపిన జిహాదీ దుండగులను కేంద్ర ప్రభుత్వం కఠినంగా శిక్షించాలన్నారు. రెండేళ్లలో తొమ్మిది మంది బజరంగ్‌దళ్ కార్యకర్తలను హత్య చేశారని, 32 మందిని గాయపరిచారన్నారు. కార్యక్రమంలో బజరంగ్‌దళ్ కార్యకర్తలు నాగేందర్, శ్రీకాంత్, నాగరాజు పాల్గొన్నారు.

మహిళకు కల్లు తాగించి బంగారం, వెండి చోరీ

పటాన్‌చెరుటౌన్: మహిళకు కల్లు తాగించి బంగారం, వెండిని గుర్తుతెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పటాన్‌చెరు మండలం రామేశ్వరం మండ గ్రామానికి చెందిన గాలమ్మ కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తుంది. ఈనెల 13వ తేదీన గాలమ్మ మండల పరిధిలోని బచ్చు గూడెం నుంచి రామేశ్వరం బండకు నడుచుకుంటూ వెళ్తోంది. స్కూటీపై రామేశ్వరం బండ వైపు వెళ్తున్న ఇద్దరు కల్లు దుకాణం ఎక్కడుందని మహిళను అడిగి చూపించమని స్కూటీపై ఎక్కించుకొని వెళ్లారు. కల్లు తీసుకొని మహిళకు కూడా తాగించారు. ఆపై ఆమె మెడలో ఉన్న తులం బంగారం గుండ్లు, 25 తులాల వెండిని ఎత్తుకొని పరారయ్యారు. బాధితురాలు పటాన్‌చెరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


మహిళను స్కూటీపై తీసుకెళ్తున్న దృశ్యం

టీచర్ వక్రబుద్ధి

- బ్యాంకులో డబ్బు డ్రాచేసిన ఖాతాదారుడు
- కూరగాయలు కొనే సమయంలో డబ్బు సంచితో పారిపోయిన ఉపాధ్యాయుడు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడు
- సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితుడి పట్టివేత


సంతోష్ కుమార్

సంగారెడ్డి టౌన్: చెడు అలవాట్లకు బానిసైన ఓ ఉపాధ్యాయుడు ఆ వృత్తికే కళంకం తెచ్చాడు. పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పి సక్రమమార్గంలో పెట్టాల్సిన స్థానంలో ఉండి వక్రబుద్ధి చూపాడు. కొద్ది నెలల క్రితం తోటి మహిళా టీచర్‌తో అసభ్యంగా ప్రవర్తించి సస్పెండ్ అయ్యాడు. ఇటీవల విధుల్లో చేరినా అతడి బుద్ధి మారలేదు. ఈసారి ఏకంగా దొంగతనానికి పాల్పడ్డాడు. బుధవారం సంగారెడ్డి డీఎస్పీ రవీందర్ రెడ్డి విలేకరుల సమావేశంలో ఆ వివరాలు వెల్లడించారు. జోగిపేట పట్టణానికి చెందిన సార సంతోష్ కుమార్ అదే మండలంలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. ఈనెల 10వ తేదీన సంగారెడ్డి ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్‌లో కొన్యాల రాములు డబ్బు డ్రా చేసుకొని భార్యతో కలిసి ఇంటికి వెళ్తున్నాడు. మార్గమధ్యలో కూరగాయలను కొనుగోలు చేసేందుకు బైపాస్ వద్ద పోతిరెడ్డిపల్లి సమీపంలో బైక్‌ను ఆపాడు. రోడ్డు దాటుతుండగా డ్రా చేసిన డబ్బుల బ్యాగు లాక్కొని పారిపోయాడు. గుర్తు తెలియని వ్యక్తి డబ్బు సంచితో పారిపోయినట్టు సంగారెడ్డి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. సీసీ కెమెరాల ఫుటేజ్ ఆధారంగా సార సంతోష్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నాడు. తన బైక్ నంబర్ ప్లేటు మార్చి ఎవరికీ అనుమానం రాకుండా బ్యాంకు వద్ద ఖాళీ చెక్కులు పట్టుకొని తిరుగుతుండేవాడు. ఎవరు డబ్బులు డ్రా చేస్తున్నది గ్రహించి, వారిని వెంబడించి దొంగతనానికి యత్నించాడు. గతంలో ఖాదీరాబాద్ ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న సమయంలో తోటి మహిళా ఉద్యోగుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినందుకు సస్పెండ్ అయినట్లు తెలిసింది. అతడి నుంచి రూ. 1.50 లక్షలు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ వివరించారు.

చీటీల మోసం కేసులో ..

- నలుగురికి ఏడాది జైలు, రూ.ఐదు వందల జరిమానా
- జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా నెల జైలు

పటాన్‌చెరు టౌన్: చీటీల పేరిట మోసం చేసిన కేసులో నలుగురికి ఏడాది జైలు శిక్ష, జరిమానా, జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా నెల జైలు శిక్ష అనుభవించాలని జడ్జి శశిధర్ రెడ్డి తీర్పు ఇచ్చినట్లు సీఐ వేణుగోపాల్ రెడ్డి, కోర్టు పీపీ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. 2015 నవంబర్ 3వ తేదీన పటాన్‌చెరు మండలం ముత్తంగి డీఎస్ కాలనీకి చెందిన రామస్వామి, అతడి భార్య మాణెమ్మతో పాటు బావమరిది యేసు, యేసు భార్య లీల చీటీ వ్యాపారులు. చీటీలు పాడిన వారికి డబ్బులు ఇవ్వకుండా పరారయ్యారు. దీంతో ముత్తంగి గ్రామానికి చెందిన సందీప్ గౌడ్ అప్పట్లో బాధితుల కలసి ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్ఐ నవీన్ కుమార్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు. బుధవారం నిందితులను సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా కోర్టు పీపీ శ్రీనివాస్ రెడ్డి వాదనలు విన్న న్యాయమూర్తి వారికి ఏడాది జైలు శిక్ష, రూ.500 జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా నెల జైలు శిక్ష అనుభవించాలని తీర్పును ఇచ్చినట్లు పోలీసులు తెలిపారు.

హామీ నెరవేర్చాలని గ్రామస్తుల ఆందోళన


గౌరయపల్లిలో ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

కొమురవెల్లి(సిద్దిపేట): ఎన్నికల హామీ నెరవేర్చాలని గ్రామస్తులు బుధవారం ఆందోళనకు దిగారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని గౌరయపల్లిలో సర్పంచ్ సద్దికృష్ణారెడ్డి గత సర్పంచ్ ఎన్నికల సమయంలో రెండెకరాల భూమి గ్రామానికి ఇస్తానని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని తెలిపారు. ఇప్పటి వరకు ఆ భూమి ఇవ్వడంలేదని ఆరోపించారు. రెండెకరాల భూమి గ్రామ పంచాయతీకి రిజిస్ట్రేషన్ చేసే వరకు ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

పెళ్లయిన యువతులకూ పరిహారం చెల్లించాలి


నిరసన వ్యక్తం చేస్తున్న యువతులు

అక్కన్నపేట(హుస్నాబాద్): గౌరవెల్లి ప్రాజెక్టు కింద ముంపునకు గురవుతున్న భూ నిర్వాసితుల ఆడబిడ్డలు కొన్ని రోజులుగా దీక్ష శిబిరంలో నిరసన వ్యక్తం చేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని పెళ్లయిన యువతులు వాపోయారు. బుధవారం పలువురు యువతులు విలేఖరులతో మాట్లాడుతూ 2010 నుంచి 2022లోపు పెళ్లయిన యువతులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ద్వారా రూ.6 లక్షలు చెల్లిస్తామన్నారని తెలిపారు. అధికారులు విడుదల చేసిన జాబితాలో దాదాపు 120 మంది యువతుల పేర్లు వచ్చినా పెళ్లి అయిందనే సాకుతో పరిహారం ఇవ్వడం లేదని కన్నీటిపర్యంతమయ్యారు. తమ గోస ఈ ప్రభుత్వానికి తెలియడం లేదా? అంటూ ఆడబిడ్డల ఉసురు ప్రభుత్వానికి తగులుతోందని మండిపడ్డారు. గుడాటిపల్లి గ్రామానికి వెళ్లే దారి మూసివేత పనులు ఎలా చేపడతారో చూస్తామని వారు హెచ్చరించారు. న్యాయపరమైన పరిహారం ఇవ్వాలని అధికారులను అడిగితే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.

పకడ్బందీగా 'కంటి వెలుగు' అమలు

తొగుట(దుబ్బాక): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని అమలు చేయడానికి పకడ్బందీగా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ కాశీనాథ్ తెలిపారు. తొగుట మండల కేంద్రంలో గురువారం ప్రారంభం కానున్న శిబిరాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న పీహెచ్‌సీల పరిధిలోని అన్ని గ్రామాల్లో ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కంటి వైద్య నిపుణులచే వైద్య పరీక్షలు నిర్వహించేలా వైద్య సిబ్బందిని నియమించినట్లు వెల్లడించారు. అర్హులైన ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీధర్, కార్యదర్శి శ్యామల, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు నష్ట పరిహారం చెల్లించాలి


వినతిపత్రాన్ని అందిస్తున్న దృశ్యం

సిద్దిపేటరూరల్: అత్యాచారాలకు గురైన ఎస్సీ, ఎస్టీ బాధితులకు ఎస్సీ, ఎస్టీ చట్టం ప్రకారం తక్షణ సహాయం, నష్టపరిహారం చెల్లించి, పునరావాసం కల్పించాలని జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు పి.శంకర్ డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో ఎస్సీ అభివృద్ధి శాఖ జిల్లా అధికారి కవితకు బాధితులతో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడారు. జిల్లాలో దాదాపు 160 మందికి పైగా ఉన్న అత్యాచార బాధితులకు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. ఎఫ్ఐఆర్ నమోదు చెసిన ఏడు రోజుల్లో మొదటి విడత, చార్జి షీటు వేసిన తర్వాత రెండవ విడత నష్టపరిహారం చెల్లింపులో తీవ్ర జాప్యం చెయడం తగదన్నారు. ప్రతీ నెల చివరి వారంలో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు మైస రాములు, డీబీఎఫ్ జిల్లా కార్యదర్శి బ్యాగరి వేణు, ఎమ్మార్పీఎస్ నాయకులు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.